# నిరుత్తరుడు

బాబూ రావింటికి నే నెప్పుడో కాని వెళ్ళడం పడదు. ప్రతాప రెడ్డిగారి ఆంధ్రుల సాంఘిక చరిత్ర వాడు కొన్నాడని తెలియగా, అది ఓ సారి పుచ్చుకోవాలని ఆవేళ వాళ్ళింటికి బయలు దేరా. తీరా వాడింటికి వెళ్ళేసరికి తలుపులు దగ్గఱగా వేసి ఉన్నాయి. వాడింట్లో లేడేమో అనుకున్నా. అయినా ఇంట్లో కనుక్కొని పోదామని, తలుపుదగ్గఱగా వెళ్ళి కేక వేసే సమయంలో—

'ఛీ నోరుముయ్' అన్న ముక్క లు వినవడ్డాయి. వెంటనే గాజుల గలగల, ఉన్న స్థానంలోంచి ఎవరో కదలి వెళ్ళిన సవ్వడీ వినవచ్చాయి. నామనస్సు ఆశ్చర్యంలో మునిగిపోయింది. ఎవరా ముక్క అన్నది? బాబూరావు అర్ధాంగేనా? ఛీ ఉత్తది. నేను పొరపాటు విన్నానా? బాబూ రావే ఆ మాటలు అన్నాడేమో! అప్పుడామె అక్కడనుంచి వెళ్ళిపోయింది కాబోలు!

తరువాత అంతా నిశ్శబ్దం. గచ్చుమీద ఒలికినపాలు దుమ్మును కలుపుకొని సవ్వడి లేకుండా ప్రాకుతూన్నట్టుంది! ఇలాంటి సమయంలో వాడ్ని పిలవాలా పిలవ గూడదా?

నే నెప్పుడు వా డిం టి కి వెళ్ళినా, గట్టిగా వాడి పేరుపెట్టి అరచే వాడ్ని. కాని ఆవేళ 'బాబూరావ్' బాబూరావ్' అని మెల్లగా పిలచాను. అయితే బాబూ రావు వెంటనే వచ్చి తలుపు తియ్యలేదు. పోనీ పలకనూ లేదు. వాడు రావటానికి రెండునిముషాలు ఆలస్యమయింది. వచ్చి, తలుపు తీసిన వెంటనే, 'ఏం: ఇలా వచ్చావ్' అని విసుగుతో అడుగుతూన్నట్టుగా వుంది వాడి ముఖారవిందం. కాని వాడట్లా అనలేదు. 'రారా. ఏమిటి విశేషాలు. ఈ మన్యారావసం మానేశావు' అన్నాడు. నాకు మతిపోయింది. వాడి మాటలు నేను సరిగ్గా వినే స్థితిలో లేను. నామనస్సు 'ఛీ. నోరు ముయ్' అన్న ముక్కమీదే పని చేస్తూంది. అది బాబూ రావు కంఠమా? లేక అతని అర్ధాంగిదా?

ఆమాటలు ఈ మాటలు అయిన తరువాత 'ఏదిరా నువ్వు మొన్న కొన్న పుస్తకం' అన్నాను. ఒక్కసారిగా వాడు నిరుత్తరుడై పోయాడు. అయితే నే నన్న



'ఏం ఇలా వచ్చావ్' అని విసుగుతో అడుగుతూన్నట్టుగా వుంది వాడి ముఖారవిందం.

ముక్కల్లో ఏపదంమీద వాడి మనస్సు పనిచేసిందోకాని - వాడిచూపులు ఎందుకనో లోని గుమ్మంవైపు ప్రసరించాయి. ఈ శబ్ద జాలం ఎంతవరకూ ప్రయాణం చేయగలదోపరీక్షిస్తున్నట్లుంది ఆతనిముఖం! అయితే ఈ విషయం నాకప్పుడు తెలియ లేదు.

వాడు నాకు పుస్తకం ఇచ్చాడు. నేను అక్కడనుంచి వెళ్లిపోయాను.

ఇంటికి చేరుకున్నానేగాని నామనసు మనసులోలేదు. అది ఎక్కడకో వెళు తూంది. ఏదో వెదుకుతూంది. దేనికో కారణాలు వివరించమంటూంది. అనేక రకాలగా తర్కిస్తూంది. నిజానికి ఈ మనసు ఉన్నదే బహు చెడ్డది! అది ఇతరుల చెడ్డను



శ్రీ నంది సోమరాజు

గురించి తెగ తెలుసుకోమని చంపుతుంది. పీక్కుతినేస్తుంది. పోనీ ఇందులో పెద్ద తప్పేముంది? మగవాడా మాటను— ఓ స్త్రీని ఉద్దేశించి అంటే, సహించి ఊరుకోగల స్తోమతు ఉన్న నేను-ఓస్త్రీ, ఎంతో కలసి మెలసి తిరిగే స్నేహితురాలు, సాక్షాత్తూ భార్య, ఆ మాటను-అనేక సంవత్సరాలు అతి సాన్నిహిత్యంతో కూడుకున్న హృదయంతో, భర్త చేసిన ఏ పెద్ద తప్పునో-అట్లా అని-నిరసిస్తే మధ్య ఏమీ సంబంధంలేని పరాయిపురుషుడైన నేను, ఇంతబాధలో తపించి పోవడమేమిటి! నిజంగా స్టుపిడిటీ. ఎంతకైనా మగజాతి మగజాతే! తన జాతిమీద ఈగనైనా వ్రాలనీయదు! పాపం! నిత్యం మగవాళ్లు అనే-ఇలాంటి మాటలతో ఆడవాళ్ళెంత కుళ్ళి కృంశించిపోతున్నారో-ఒక్కసారైనా ఊహించానా?

ఇంతలో మా ఆవిడ భోజనానికి లెమ్మన్నది. అయితే ఆమె లెమ్మన్న వెంటనే నేను లేస్తానా ఏమిటి? అప్పుడు నా గొప్పతనం ఏముంది? నేనింకా దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చున్నాను. ఆమె 'ఫస్టు బెల్' 'సెకండ్ బెల్' అన్నట్లుగా మళ్ళీ కేకేసింది. నాకు చికాకెత్తింది. దానితో 'ఛీ. నోరుముయ్' అన్నా. అలా అన్న తరువాత నాకు నవ్వొచ్చింది. నా నవ్వుచూసి ఆమెమూతి ముడిచింది. ఇదిచూసి నాకు దీర్ఘంగా ఆపుకోలేని నవ్వు తరుముకొచ్చింది. ఇది చూసి ఆమె మూతి విరిచింది. ఆ విరుపు చూడగానే, 'ఎందుకే భామా! ఆ మూతి నస్తమానూ అట్లా విరుస్తావు. అలా అస్తమానూ విరిస్తే, కొన్నాళ్లకక్కడ పెళుసెక్కి విరిగి పోగలదు' అన్నా. ఈసారి ఆమె సుమనోహరమైన నవ్వు సన్నగా ప్రకటించకుండా ఉండలేకపోయింది.

నేను భోజనముదగ్గిఱ కూర్చొని 'అయితే ఆవేళ ఇందిర దగ్గఱకు వెళ్ళావుగదా— మరి ఆమె ఏమి మాట్లాడిందో నాకొక్క విషయమూ చెప్పావుగాదేం' అన్నా, బాబూరావు భార్యామణి నుద్దేశించి.

మా ఆవిడ 'ఇప్పుడావిడ సంగతి మీకెందుకూ' అంది. 'అబ్బె! ఊరకనే.' అనేసి ఊరుకున్నా; చెప్తితే చెప్పలేకపోతే మానేసెయ్ అన్నట్టు. అలా అనకపోతే ఆమెచేత వాగించడం బహుకష్టం లెండి

ఇక ఆమె చెప్పడం ఆరంభించింది.

మొట్టమొదటగా, 'ఇందిర ఎంత మంచిదనుకున్నారు' అంది. నా హృదయంలో కళుక్కుమంది. అయినా వినక తప్పింది. కాదు. 'ఆవేళ వాళ్ళింటికి వెళ్ళగానే ఎంతమర్యాద చేసిందనుకున్నారు. ఫలహారాలు చేసిపెట్టింది. కాఫీ ఇచ్చింది. ఏవేవో విషయాలు బోలెడన్ని చెప్పింది పాపం! వాళ్లాయన, సినిమాలకు పుస్తకాలకు, తెగ తగలేస్తూ వుంటాడట. డబ్బు కూడ ఎవరికి బడితే వాళ్ళకు అప్పుగా ఇచ్చేస్తూ ఉండటమో, దానాలు చేసేస్తూ ఉండటమో చేస్తూ ఉంటాడట! ఇలాగుంటే ఎలాగండీ మరి! అదేమైనా సంసారమా—ఇంకేమైనానా? ఇవ్వాళ ఉంది గదా అని ఊరికే కళ్లు మూసుకొని ఖర్చుపెట్టేస్తూఉంటే—ముందు గతి కానొద్దటండీ! ఇదంతా చెప్పి ఆమె ఎంత బాధపడిం దనుకున్నారు? ఆమె, అంతా మంచిదే కాని, కోపం వస్తేమాత్రం మనిషిగాదండీ! ఆవేళ వాళ్ళ పిల్లాడ్ని ఎంత గట్టిగా కొట్టిం దనుకున్నారు. ఆడుకుంటూ బంతి కుళ్లు కాలవలో పారేశాడని ఎంత గట్టిగా కొట్టిందో చెప్పలేను. వాడు ఒకటే ఏడ్పు. ఇంతకోపం ఉంటే ఎలా కాపురం చేస్తుందండీ? ఏమీ ఎరగని పసిపిల్లాడ్ని బాదుకుంటే ఏమొస్తుందీ!' అని మా ఆవిడ, ప్రక్కింటావిడ ఎందుకో పిలిస్తే, ఆ ప్రసంగం అంతటితో కట్టిపెట్టి వెళ్లిపోయింది. మళ్లీ ఈ ప్రసంగం మామధ్య రాలేదు.

నిజానికి బాబూరావు అద్భుతమైన సౌందర్యమూర్తి. ఇందిర అందాలరాణి. ఇట్లాంటి జంట కుదరడం చాల అరుదు. వాళ్ళు చక్కగా ముస్తాబై సినిమాకు పోతూవుంటే, వాళ్ళముందునుంచి పోయేవాళ్లు అప్పటివరకూ చూసింది చాలక వాళ్ళను దాటినతరువాత కూడ, కళ్ళు వెనక్కి కాళ్లు ముందుకీ పోనిస్తూ ప్రాణాల్ని సైతం లెఖ్ఖ చెయ్యరు!

బాబూరావెంత అందమైనవాడో అంత శీవిగా ఉంటాడు. అతని కంఠస్వరం విన్నవాడు భార్యతో ఇట్లాంటి మాట అనిపించుకుంటాడని కలలో కూడా అనుకోడు. మా ఆవిడ చెప్పినదాన్నిబట్టి ఎంతాలోచించినా, బాబూరావు భార్యమాట వినేవాడిలా కనుపించలేదు. ఆమెను నిజంగా లొంగినవాడైతే ఆమె వద్దంటున్నా అట్లాంటి పను లెందుకు చేస్తాడు? అయితే ఆవేళ పుస్తకం ఇచ్చేటప్పుడు అట్లా చూసాడేమిటి? అప్పటికి జరిగిన మాటలమీదే నిలచిన ఆతని మనసు—ఆ మాటల మీదే పనిచేస్తూ అటువైపు చూపు నిలిపిం

# ★ నియంతృత్వం ★



అబ్బాయి :- అమ్మా! మా స్కూల్లో జరిగే పరుగు పందాలలో నా పేరుకూడా ఇచ్చాను.

అమ్మ :- ఇస్తే ఇచ్చావుగాని నెమ్మదిగా పరిగెత్తునాయనా; లేకపోతే ఏ కాళ్లో విరగ్గొట్టుకుంటావు.

కేమో! ఏమైనా వాడట్లాంటి మాటలు పడే మనిషిమాత్రం కాడు. ఎంచేతనో నా హృదయం ఈ విషయం ఋజువుచేసుకోమని బాధించడం మొదలుపెట్టింది. నిజానికి వాళ్లు ఒకర్ని ఒకరు తిట్టుకున్నారని కాదు కాని - అసలిల్లాంటి పరిస్థితికి ఎవరు కారకులై ఉంటారా అన్నది నాకు పెద్ద సందేహమై పోయింది.

అప్పటినుంచీ వాడితో ఎప్పుడు మాట్లాడినా - వాడ్ని జాగ్రత్తగా పరిశీలించడం మొదలు పెట్టా. కాని వాడెప్పుడూ తన ఇంటిసొద నా దగ్గర తేలేదు. ఆమె అంత వేడిపించేదైతే, ఎప్పుడైనా ఏవిషయంమీదనైనా కొంత కాకపోతే కొంతయినా ఆమెపై ఉన్న అసహ్యమైనభావాన్ని వ్యక్తం చెయ్యకుండా ఉంటాడా అని నా అంతరాత్మ బాధించడం మొదలుపెట్టింది. కనీసం ఆమెను కాకపోయినా, ఇతర ఆడవాళ్ళనైనా ఆ బాధతో తిట్టకుండా ఉంటాడా అనికూడా వ్యథపడింది. ఓ రోజున నేనే ఏదో సందర్భంలో 'మా మీ ఇందిర చాలమంచిదని చెప్పిందోయ్! అఫిష్, అల్లాంటి మర్యాద ఆమె మాయింటికి వస్తే లను చెయ్యలేనని కూడా. చెప్పింది' అని చెప్పి చూశా 'ఇల్లాంటి మర్యాద మీకూ మీకే గాని నాకేం చెయ్యదులే' అని ఏమైనా అంటాడేమోనని. కాని అతని దగ్గరనుంచి ఓ చిన్ని కనిపించీ కనిపించని నవ్వు తప్ప మరేమీ జవాబు పొందలేక పోయాను.

మరో రోజున, 'అబ్బబ్బ! ఈ ఆడవాళ్ళతో చచ్చిన చావోయ్. వేగలేక పోతున్నాను. ఇంటికి వెళ్లితే యమయాతన అనుకో. నిజంగా అనుకూలదాంపత్యానికి ఎంత పెట్టిపుట్టాలి! నువ్వు నయంరా. హాయిగా ఏ గొడవా లేకుండా ఉంటావు. దేనికైనా ఆ మాత్రం అర్థం చేసుకోగల భార్య ఉండటం నిజంగా భర్త అనే ప్రాణికి ఎంతసుఖం!' అన్నా; ఇప్పుడైనా—"ఆ...అ. అందరాడవాళ్లూ ఒక్కలాటే లేవోయ్"అని అంటాడేమోనని! కాని అబ్బే! వాడినోటివెంట అట్లాంటి మాట రానిదే! మళ్ళీ మునపటి లాగే ఓ నవ్వు బహుతమాషగా నవ్వేసి ఊరుకున్నాడు. ఇంత గుట్టుగా ఉండేవాడి దగ్గర ఇంకీవిషయం గ్రహించటం ఎట్లాగో నా మనసు ఊహించలేకపోయింది.

ఇట్లా ఉండగా ఓ రోజున బాబూరావు మా ఇంటికి వచ్చాడు. వచ్చీరాగానే 'భయంకరం! ఇవ్వాళ చూశావా గూడ్సు బండిని ఢీకొని ప్యాసెంజరు బండి ముక్కముక్కలైపోయింది. ఎంతమంది చచ్చిపోయారో లెక్కలేదు' అన్నాడు.

నేనా భయంకరమైన దృశ్యాన్ని చూసి అప్పుడే ఇంటికివచ్చాను. 'అవును పాపం! చాలమంది చచ్చి పోయారు. ఒక్క మనిషి చేసే చిన్ని పొరపాటుకు ఎంతమంది ఆహుతి కావలసివస్తోందో' అన్నా. ఇది వింటూనే బాబూరావు, 'ఇవ్వాళ నారాయణరావు పూనా ప్రయాణం. వాడ్ని ప్రక్క స్టేషనుకు తీసుకువెళ్ళి ఎక్కించి వస్తున్నా. నిజానికి వాడి గుండెలు పీచు పీచుమంటూనే ఉన్నాయి. వాడితో అన్ని రైళ్లనులూ గుద్దుకోవులేరా; అపాయాలు వచ్చేముందు కొన్నింటికి సర్దుకోగల తాహతు ఉంటుందిలే అని చెప్పి-ప్రయాణం ఆపుకోకుండా చేశాను.' అన్నాడు. ఇలా వాడంటూ వుంటే నా మనస్సులో ఇదమిద్ధమనరాని భావమేదో కలిగి, చప్పున బయటనుంచి పాలవాడు వేసేకేకతో అణగారిపోయింది.

పాలవానికివ్వవలసినదేదో నేను పర్సు తీసి ఇస్తూవుండగా బాబూరావు 'అబ్బ! ఈ పర్సు నీదగ్గర ఇంకా ఉందిరా? మెడ్రాసులో మనిద్దరమూ ఆరోజున ఒకే రకం పర్సులు కొన్నాము. నా పర్సు మా చుట్ట మొకాయన కాజేశాడు. నీవు వీలుగా ఉంటే. ఇది నాకిచ్చేద్దూ' అన్నాడు ఏక బిగిని.

వాడిలాంటి వడగటమూ నే నివ్వక పోవడమూ ఎప్పుడూ జరగదు కాబట్టి 'ఏం. నీకంతగా కావలిస్తే తీసుకో' అన్నా. వాడు చప్పున 'థేంక్సురా' అంటూ పెద్ద కొండ దొరికినట్లుగా అందుకున్నాడు ఆ తరువాత 'ఇప్పుడు నాకు కొంత పనొచ్చింది. ఓ యాభైరూపాయిలుంటే ఇలా ఇయ్యి. రేపు ప్రొద్దున్నే ఇచ్చేస్తాను.' అన్నాడు. ఇట్లా వాడెప్పుడూ ఎవ్వరినీ డబ్బు అడిగిన పాపాన పోలేదు. అట్టి ఛాన్సు నాకు రావడం నా అదృష్టంలా భావించుకొని, 'ఓ. తప్పకుండా!' అంటూ వాడికి ఆ డబ్బు ఇచ్చి పంపించాను. ఇక ఆరోజంతా వాడికి డబ్బెందుకు కావలసి వచ్చిందా అనే ఆలోచించాను. కాని అంతు చిక్కలేదు.

ఆ మర్నాడే వాడా డబ్బుతీసుకొచ్చి నాకిచ్చేశాడు. 'అరె అప్పుడే ఇచ్చేసేవే!' అన్నా, ఇలా అనడం భావ్యం కాబట్టి. ఎందుకనో వాడింత త్వరగా బాకీ తీర్చివేయడం నా మనస్సుకు తృప్తి నీయలేదు.

ఆ తరువాత వాడూ నేనూ ఎప్పుడో కాని కలవడం పడలేదు. అది వాళ్ళింటి దగ్గర జరిగింది. మేమిద్దరమూ మాట్లాడుతూవుండగా, ఇందిర నవ్వుతూ వచ్చి కాఫీ ఇచ్చింది. నా మనసులో అప్పుడే వేవో విషయాలు గింజుకున్నాయి. అంత సుప్రసన్నమైన వదనంకల ఆమె నోట నుంచి ఛస్తే ఎప్పుడూ అంట్లాంటి మాట రాదని మనసులోని మనసు ఘాటుగా చెప్పింది.

ఇంతలో నారాయణరావు పెద్దగొడవగా లోపలికి వచ్చాడు. పెద్ద బెడ్డింగూ అదీ రిక్షా వాడు లోనికి తీసుకవచ్చాడు. 'అబ్బ! వెధవ ప్రయాణం చావురా బాబూ. ఈ థర్డు క్లాసు ప్రయాణమంత చావు మరొకటి లేదు.' అంటూ కుర్చీలో కూలబడ్డాడు. బాబూరావు 'ఏరా. ఇన్నా ళ్లుండిపోయేవేం? అప్పుడే వచ్చేస్తానన్నావు' అంటూ పరామర్శించాడు. 'అబ్బో బోలెడంత గ్రంథం జరి

# నియంతృత్వం

గిందిలే. ముందు ఆ రిక్షావాడికి డబ్బు లిచ్చేయ్' అన్నాడు. బాబూరావు పర్సు తీసి సైలెంటుగా ఆ రిక్షావాడికి డబ్బు లిచ్చి పంపించాడు. ఇంతలో నారాయణరావు బాబూరావు చేతిలోని నా పర్సు చూసి, 'అరె! నీకు మళ్ళీ ఈ పర్సు ఎట్లా దొరికింది? అదేనా...ఏదీ ఇలా ఇయ్యి... అవును అదే...బలే లక్కీ ఫెలోవే! ఆ యాభైతోనే దొరికిందా? నీకిలాంటి పర్సు కొని పంపాలని పూనాలో చాల ప్రయత్నించాను. కాని ఇలాంటిది అక్కడెక్కడా కనిపించలేదోయ్......అయితే ఇంతకీ ఇది ఎలా దొరికింది?' అని వాడు ఏకబిగిని వాగేస్తూ వుంటే బాబూరావు కాస్సేపు బిత్తరచూపులు చూస్తూ కూర్చుండిపోయాడు. నారాయణరావు అన్న మాటలు ఇల్లంతా ప్రతిధ్వనించాయి. అయినా ఈ మాటలు ఈ దళసరిగోడలు దాటి ఎంతదూరం పోగలవో తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తూన్నట్లుంది బాబూరావు ముఖము. బాబూరావు బాధ నిజంగా వర్ణనాతీతము. నావైపు వాడెంతో అమాకంగా చూశాడు. అలా చూసి నారాయణరావుతో మెల్లిగా, 'ఇది ఆవేళ, అక్కడే ఆ కొట్టుదగ్గరే దొరికిందిరా' అన్నాడు. అప్పుడే ఇందిర నారాయణరావుకు కాఫీ తీసుకొచ్చింది. ఈమాట ఆమె విన్నందుకు బాబూరావు మొగము తృప్తిని ప్రకటించింది. కాని ఇందిర నారాయణరావుతో, 'ఏమో అన్నాయ్! అది నిజంగా పోయే వుంటుంది. ఈయన ఇంకొకటి కొనే ఉంటారు' అంది. వెంటనే బాబూరావు 'ఛీ. నోరుముయ్' అన్నాడు. ఆమె లోనికి వెళ్లిపోయింది. నారాయణరావు పకపకా నవ్వుతూ 'ఇది అలా దొరికే పర్సు కాదులే అమ్మాయ్' అంటున్నాడు.

ఇక నాగురించి బాబూరావు యమయాతన పడుతున్నాడు. నేనిక అక్కడ ఉండడం బాగుండదని 'వస్తా' నంటూ అక్కడనుంచి మెల్లగా జారుకున్నా.

నే నింటికి పోతూవుండగా బాబూరావునుగురించి నాకనేకమైన విషయాలు తట్టాయి. అయితే ఇక అవన్నీ మీకు కూడ కలగటంలో ఏమాత్రం అనుమానం లేదు. కాని 'పాపం! బాబూరావు ఎటువంటి నియంతృత్వపు బందిఖానాలో ఇరుక్కుపోయాడో!' అని మాత్రం మీరూ నేనూ విచారించక తప్పదు! అయితే అతని కా బాధ లేదులెండి! నిజానికిదేగా మనకు కావలసింది! ★

★ హకల్ బెరీఫిన్ ★

వెల. రూ. 2-0-0 పోస్టుఖర్చులు ప్రత్యేకం.
ఆంధ్రగ్రంథమాల, పోస్టుబాక్సు 212, మద్రాసు-1.

"లక్స్ టాయ్‌లెట్ సబ్బు నా ముఖమును మనోహరముగా నుంచును"

అని కన్నాంబ చెప్పుచున్నది




మనోహరమైన సువాసనతోగూడిన ఈ తెల్లటి శుద్ధ సబ్బుతో మీ చర్మమును మనోహరముగా నుంచుకొనండి.

సినీమా తారలకు సౌందర్యమునిచ్చు సబ్బు

LTS. 338-X30 TL